ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శనివారం 10 మే 2025



పకడ్బందీగా రాజీవ్ యువ వికాసం అమలు చేయాలి

రాయికల్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువవికాసం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని బీఆర్ఎస్ మండల కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిరుపేద యువతకు స్వయం ఉపాధిపథకాలకు చేయూతనిచ్చే పథకాలను గతంలో మాదిరి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం లబ్ధిదారులను కుదించడానికి సిబిల్ స్కోరు తక్కువగా ఉంటే అమలు చేయమని కొర్రీలు పెడుతుందని ఆరోపించారు. 50శాతం మంది లబ్ధిదారులకు పాన్ కార్డులు లేవని, గతంలో లేని ఇబ్బందులు ఇప్పుడెందుకని అన్నారు. ప్రభుత్వం నిరుద్యోగులకు చేయూతను అందించేందుకు యువ వికాసం పథకాన్ని గతంలో మాదిరి అమలు చేయాలని కోరారు.

పసుపు సాగుకు జై..

- ఈ సీజన్‌లో జిల్లాలో 50 వేల ఎకరాల్లో సాగు అంచనా
- దుక్కులు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- విత్తన పసుపునకు భలే డిమాండ్
- క్వింటాలుకు రూ.6 వేల చొప్పున విక్రయం

6

ముురుగు.. కనుమరుగు



జగిత్యాల పట్టణం వ్యూ

● 21,700 నివాస గృహాలు..

జగిత్యాల మున్సిపాలిటీ పరిధిలో 21,700 గృహాలు ఉన్నాయి. వీటి ద్వారా వెలువడుతున్న మురుగు నీరు డ్రైనేజీలద్వారా ముందుకు సాగుతోంది. అయితే అడ్డంకులు, అసంపూర్తి నిర్మాణాలతో నీరు నిలిచి చెత్త, చెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతుండడమే కాక దోమల వృద్ధికి కారణమవుతోంది. చిన్నపాటి వర్షం వచ్చినా నీరంతా రోడ్లపైకి చేరుతోంది. ఈ సమస్య పరిష్కారం కోసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా 2వేలకు పైగా మ్యాన్ హోల్స్, 7,233 ఇన్స్‌పెక్షన్ చాంబర్స్ ఏర్పాటు ఏర్పాటు చేసి 108.5 కిలోమీటర్ల నిడివితో పైపులైన్ నిర్మిస్తారు. ఇళ్లలో నుంచి నీటిని మ్యాన్‌హోల్స్‌లోకి అక్కడి నుంచి సబ్ లైన్స్, ఆపై ట్రంక్‌మెయిన్‌ద్వారా సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (మురికినీటి శుద్ధి కేంద్రం)కు పంపుతారు.

- జగిత్యాలలో రూ.400 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ
- రెండు వేలకు పైగా మ్యాన్‌హోల్స్
- 7,233 ఇన్స్‌పెక్షన్ చాంబర్స్ ఏర్పాటు
- కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శికి డీపీఆర్ సమర్పణ
- ఏడాదిన్నరలో పూర్తి చేసేలా కార్యాచరణ

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మున్సిపాలిటీ కొత్త రూపు సంతరించుకోనుంది. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్‌ల సూచనలతో జగిత్యాలలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి యూఐడీఎఫ్ ద్వారా రూ.400 కోట్లు నిధులతో డీపీఆర్‌ను సిద్ధం చేశారు. ఈ నిధులతో కిలోమీటర్ల మేర అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించనున్నారు. పైపులైన్ విధానంలో నిర్మించే ఈ ప్రాజెక్టు పూర్తయితే జగిత్యాలలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది.

● నాలుగు జోన్లుగా విభజన..

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణంలో భాగంగా జగిత్యాలను నాలుగు జోన్లుగా విభజించారు. పట్టణాన్ని మొదటి జోన్‌గా, శివారు ప్రాంతాలను 2, 3, 4 జోన్లగా నిర్ధారించారు. ఆయా జోన్లలోని లోతట్టు ప్రాంతాల్లో సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు (ఎస్‌టీపీ) నిర్మించి అక్కడికి మురుగునీటిని మళ్లిస్తారు. అక్కడ నీటిని శుద్ధి చేసి వ్యవసాయ అవసరాలతో పాటు పార్క్, డివైడర్లు, రోడ్ల పక్కన పెంచుతున్న మొక్కలకు వినియోగిస్తారు. ప్రస్తుతం ఇళ్లలో నుంచి వెలువడుతున్న మురుగునీరు చెరువులు, కాలువల్లో కలిసి కలుషితమవుతోంది. యూజీడీ పనులు పూర్తయితే ఈ సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ఈ పనులను ఒప్పందం ప్రకారం రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉండగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఏడాదిన్నరలోనే పూర్తి చేయాలని యోచిస్తున్నారు. పనులు పూర్తయ్యాక పదేళ్లపాటు నిర్మాణ కంపెనీయే నిర్వహణ బాధ్యతలు చూసుకుంటుంది. మురుగునీరు ముందుకు సాగేలా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మిస్తుండగా వర్షపు నీటిని తరలించేందుకు స్టార్మ్ వాటర్ డ్రెయిన్ (ఎస్‌డబ్ల్యూడీ) సిస్టమ్ నిర్మించనున్నారు.

● ఇవీ ప్రయోజనాలు..

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంతో పట్టణంలో వర్షపు నీరు ప్రణాళిక బద్ధంగా తొలగించడుతుంది. దీనివల్లరోడ్లు, ఇతర ప్రాంతాలు నీటితో నిండిపోకుండా ఉంటాయి. గాలిలో దుమ్ము, మట్టి తక్కువగా ఉండడం వల్ల ప్రజలు ఆరోగ్యానికి ఇబ్బంది కలగదు. పట్టణంలో గాలి స్వచ్ఛంగా ఉండే అవకాశాలున్నాయి. భవిష్యత్తులో..

మిగతా 8లో

ఎరువుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

● జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్

కోరుట్ల రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : డీలర్లు ఎరువుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి భాస్కర్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ఎరువుల నిల్వలను పరిశీలించారు. దుకాణాలలో స్టాక్ వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. దుకాణాల లైసెన్స్ పరిశీలించి ఫార్మర్ రిజిస్ట్రీ నమోదును తనిఖీ చేశారు. ఎరువులు కొనుగోలు చేసే రైతులకు బిల్లును అందించాలని సూచించారు. రైతులు కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధి కోసం వ్యవసాయ శాఖ వద్ద ఫార్మర్ రిజిస్ట్రీలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే పన్నుల వసూళ్లు

-మున్సిపల్ కమిషనర్ మనోహర్



బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లను సన్మానిస్తున్న కమిషనర్ మనోహర్

రాయికల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల సహకారంతోనే పన్నుల వసూళ్లలో రికార్డు సాధించినట్లు రాయికల్ మున్సిపల్ కమిషనర్ మనోహర్ అన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను పన్ను వసూళ్లలో రాయికల్ మున్సిపాలిటీ రాష్ట్రంలో పదో స్థానంలో నిలిచింది. దీంతో కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రాయికల్ కమిషనర్‌ను అభినందించడమే కాకుండా మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రూ.1.20 కోట్లు ఇన్సెంటివ్ గ్రాంట్స్ మంజూరు చేశారు. పన్నుల వసూళ్లలో అత్యుత్తమ ప్రతిభ చూపిన బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, సహాయ సిబ్బందిని శుక్రవారం ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లోనూ పట్టణ ప్రజల సహాయ సహకారాలు ఇలాగే కొనసాగాలని, పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ వెంకటి, ఆర్ఐ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, మే 9(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం రాజారంకు చెందిన శివరాత్రి గంగరాజం అనే వ్యక్తి అనారోగ్యానికి గురి కాగా హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతుండడంతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రెండు లక్షల విలువైన ఎల్‌వోసీ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గంగరాజం కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, శనిగారపు తిరుపతి, నక్క అనిల్, బండి రవిగౌడ్, బీవీ రమణ, నర్సయ్య పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెగడపల్లి మండల పశువైద్యాధికారి హేమలత పేర్కొన్నారు. శుక్రవారం పెగడపల్లి మండలంలోని కీచులాటపల్లిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం నిర్వహించి గాలి కుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మతిన్, గోపాలమిత్రలు తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల యువతికి డాక్టరేట్

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్ కాలనీకి చెందిన మెట్టు సంయుక్త ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. యూనివర్సిటీకి చెందిన గైడ్ ఈట అశోక్ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనకు గాను ఉస్మానియా యూనివర్సిటీ ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ డాక్టరేట్ ఇచ్చింది. ఈసందర్భంగా సంయుక్తను పలువురు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోరుట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణం కల్లూర్ రోడ్డులోని 33/11 కేవి సబ్‌స్టేషన్ పరిధిలో సాయత్రం 4:30 గంటల నుంచి 6:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్యాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల, పొలాస సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని ఏఈ సుందర్ తెలిపారు. పొరండ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని పొరండ్ల, బాలపల్లి, కన్నాపూర్, కండ్లపల్లి, పెర్కపల్లి, హన్మాజీపేట గ్రామాలతో పాటుగా పొలాస సబ్‌స్టేషన్ పరిధిలోని పొలాస, గుల్లపేట, అనంతారం, రొడ్డాం, అగ్రికల్చర్ కాలేజీ, ఎక్స్‌ప్రెస్ ఫీడర్ హైదరపల్లి గ్రామాల్లో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏఈ తెలిపారు.

● మల్యాల: మల్యాల, తక్కళ్లపల్లి సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ దయానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు మల్యాల, ముత్యంపేట, రాజారం, నూకపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాల గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

● కొడిమ్యాల: కొడిమ్యాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం 4గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏఈ రఘునాథ్ తెలిపారు. రామకిష్టాపూర్, కొండాపూర్, చింతల్లపల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు



తక్కళ్ళపల్లిలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కథలాపూర్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల వసతులు ఉన్నాయని విద్యార్థులకు అందులో చేర్పించాలని ఎంఈవో లోకిని శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని తక్కళ్ళపల్లిలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించి వీధుల వెంట ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు రవీందర్, రవి, భారతి, ఉపాధ్యాయులు శ్రీధర్, విష్ణు, సాయిరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.

'టీబీ ముక్త్ భారత్ అభియాన్'కు ప్రత్యేక ప్రణాళిక



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్

జగిత్యాల, మే 8 (ఆంధ్రజ్యోతి): 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమ అమలుకు వంద రోజుల ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలని సమీకృత జిల్లా అధికారుల సముదాయంలోని వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ కే ప్రమోద్ కుమార్, ఉపవైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లాలో వైద్యాధికారులకు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌లకు టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం క్రింద వంద రోజుల కార్యచరణ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో క్షయ వ్యాధికి గురి అయ్యేటువంటి అవకాశం ఉన్న వ్యక్తులను గుర్తించి జిల్లా కార్యాలయంనకు పంపించవలసిందిగా ఆదేశించారు. 60 సంవత్సరాల పైబడిన వృద్ధులు, పొగ తాగేవారు,

ఆల్కహాల్ తాగడం, పొగాకు తినడం, డయాబెటిస్ ఉన్నటువంటి వారిని గుర్తించి వివరాలు అందించాలని తెలిపారు. ఆ తర్వాత 100 రోజులలో వారందరినీ స్క్రీనింగ్ చేసి అవసరమైన వైద్య పరీక్షలు చేయడం, ఎక్సరేలు తీసి టీబీ వ్యాధి గ్రస్తులను గుర్తించి చికిత్సలు అందిస్తామని తెలిపారు. ఒకవేళ నెగటివ్ వచ్చినట్లయితే టీబీ ప్రివెంటివ్ థెరపి ద్వారా చికిత్స అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ ఏ శ్రీనివాస్, డాక్టర్ జైపాల్ రెడ్డి , డాక్టర్ అర్చన, డిపిఓ రవీందర్, అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ, హెల్త్ ఎడ్యుకేటర్స్ కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

'సజావుగా ధాన్యం కొనుగోళ్లు'

జగిత్యాలరూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతోందని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస, బాలపల్లి ప్యాక్స్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ధాన్యం కొనుగోళ్ల వివరాలు, అందుబాటులోఉన్న తార్పలిన్ కవర్లు, గన్నీ బ్యాగులు, కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలింపు తదితర వివరాలను కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా బాలపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నామన్నారు. రవాణా నిమిత్తం లారీల కొరత ఎక్కడా లేదని కలెక్టర్ తెలిపారు. రైతుల దగ్గర కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం 17శాతం తేమ రాగానే కాంటా వేసి కొనుగోలు చేసి సంబంధిత మిల్లులకు తరలించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్‌డీఓ మధుసూధన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఏపీఎం ఓదెల గంగాధర్, తదితరులు ఉన్నారు.



కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

'ఆపరేషన్ సిందూర్' హర్షణీయం

● ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



ర్యాలీలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మే 9 (ఆంధ్రజ్యోతి): పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పే విధంగా ఆపరేషన్ సిందూర్ పేరుతో చేపట్టిన సైనిక చర్యను హర్షిస్తున్నామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పార్టీలకు అతీతంగా ధర్మపురి పట్టణంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆధ్వర్యంలో సంఘీభావ ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ ర్యాలీ స్థానిక నంది చౌక్ నుండి గాంధీ చౌక్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరుతో చేసిన సైనిక చర్యను ఏఐసీసీ అగ్రనాయకులు రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి, అఖిత భారత కాంగ్రెస్ పార్టీ సంఘీభావం తెలిపారని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి రాజకీయాలకు అతీతంగా తాము అండగా ఉంటామని ఆయన తెలిపారు. తీవ్రవాదులను పెంచి పోషించుకుంటూ దాడులకు పాల్పడుతున్న పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పాలని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా తాము మద్దతు ప్రకటిస్తామని ఆయన పేర్కొన్నారు. భారత దేశం వైపు కన్నెత్తి చూడటానికి పాకిస్తాన్ వెన్నులో వణుకు పుట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యప్రకమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్‌రావు, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లా ఎస్సీ సెల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, పట్టణ కాంగ్రెస్ చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అప్పం తిరుపతి, అక్కపెల్లి రాజేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ సీపతి సత్యనారాయణ, పెగడపల్లి మాజీ జడ్పీటీసీ తాటిపర్తి శోభారాణి, బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, మాజీ అధ్యక్షులు బెజ్జారపు లవణ్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, కస్తూరి రాజన్న, ఎండీ రఫియొద్దీన్, సింహరాజు ప్రసాద్, ఒజ్జల లక్ష్మణ్, ఆశెట్టి శ్రీనివాస్, సుముఖ్, బొల్లారపు పోచయ్య, రాపర్తి సాయికిరణ్, రాందేని మొగిలి, రంగు అశోక్, కొనపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ షెడ్లను తొలగించండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నాయకులు

జగిత్యాల అర్బన్, మే9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని ప్రధాన కూడళ్లలో అక్రమంగా వేసిన షెడ్లు వెంటనే తొలగించాలని విశ్వహిందూ పరిషత్ నాయకులు జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు బోయిని పద్మాకర్, ఏసీఎస్ రాజు, జిట్టవేణి అరుణ్ కుమార్, అంకర్ సుధాకర్ పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని సందర్శించిన ఎంఈవో

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోధుర్ జిల్లా పరిషత్ స్కూల్‌లో ఈనెల 2న ప్రారంభమైన సమ్మర్ క్యాంప్‌ను మండల విద్యాధికారి మధు గురువారం సందర్శించారు. ఈసందర్భంగా పిల్లలకు నేర్పిస్తున్న యోగా, స్పోకెన్ ఇంగ్లీష్, వేదిక్ మ్యాథ్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సమ్మర్ క్యాంప్ ఇంచార్జి రవీందర్, రాజేందర్ ఉపాధ్యాయులు చిన్నయ్య, నర్సయ్య, ప్రేమ్, అశోక్, రఘు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

PLOT FOR SALE
★ కరీంనగర్ హౌజింగ్ బోర్డు ప్రక్కన మారుతి నగర్‌లో 328 స్క్వేర్ యార్డ్స్, తూర్పు ఫేస్ 30 ఫీట్ల రోడ్, మేయిన్ రోడ్‌కు 80 మీటర్లు దూరంలో గల ఇంటి స్థలం అమ్మబడును. సెల్ : 86886 75858 (40'X74' సైజు)
AJK-

WANTED
» అమేజాన్ అసోసియేట్స్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లను నియమించడం - రిఫరల్ ఆధారిత ఆదాయాలు. జీతం : 15-20 వేలు వరకు సంప్ర. 63017 21339
AJB-83

3+2 స్కీం కలదు

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్: 9703618691, 9985410640
జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 99854 11262
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238

పురుగుల మందు తాగి యువతి బలవన్మరణం


కవిత (ఫైల్)

ఇల్లందకుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని శ్రీరాముల పల్లె గ్రామానికి చెందిన మేకల కవిత(30) పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కవిత ఉన్నతచదువులు చదివి పలుఉద్యోగాలకు పోటీపరీక్షలు రాసింది. ఈక్రమంలో కుటుంబసభ్యులు అమ్మాయికి పెళ్లి చేయాలని సంబంధాలు చూస్తున్నారు. ఇటీవల కవితకు పెళ్లి సంబంధం చూశారు. కానీ కవిత ఇప్పట్లో నేను పెళ్లి చేసుకోను అని చెప్పింది. పెళ్లిపై ఇష్టం లేక గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందుతాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జమ్మికుంటలోని ఓ ప్రైవేట్‌ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యంకోసం వరంగల్ ఎంజీ ఎంకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. మృతురాలి తండ్రి మేకల సారయ్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ప్రొబెషనరీ ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు.

మతిస్థితిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

ముత్తారం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మిడిదొడ్డి వెంకటేష్(31) మతిస్థిమితం లేక మద్యం మత్తులో ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ గోపతి నరేష్ తెలిపారు. మండల కేంద్రానికి చెందిన వెంకటేష్ కటింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. కొద్ది రోజులుగా మతిస్థిమితం లేక మద్యానికి బానిసైనట్లు తెలిపారు. దీంతో శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంకటేష్‌కు భార్య మౌనిక ఉన్నట్లు తెలిపారు.

గుండెపోటుతో ఉద్యోగి మృతి


మల్లేశం (ఫైల్)

గన్నేరువరం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దారు కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గన్నేరువరానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి న్యాత మల్లేశం(55) శుక్రవారం గుండె పోటుతో మృతిచెందాడు. మల్లేశంకు శుక్రవారం తెల్లవారుజామున గుండెనొప్పి రావడంతో కుటుంబసభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని ఇంటికి తరలించారు.

వ్యవసాయ బావిలో పడి వృద్ధురాలు మృతి


రాజుబాయి(ఫైల్)

రాయికల్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన మామిడి రాజు బాయి (85) అనే వృద్ధురాలు వ్యవసాయ బావిలో పడి శుక్రవారం మృతి చెందింది. రాజుబాయికి మతిస్థిమితం సరిగా లేదు. ఈనెల 5న కుటుంబసభ్యులకు తెలియకుండా ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. మృతురాలి మనువడు మామిడి సంజీవ్ ఫిర్యాదు మేరకు రాయికల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా రాయికల్ గ్రామ శివారులో గల వ్యవసాయ బావిలో పడి వృద్ధురాలు చనిపోయి కనిపించింది. మృతురాలు మతి స్థిమితం సరిగా లేనందున ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయి ఉండవచ్చునని మృతురాలి కుటుంబసభ్యులు తెలుపగా రాయికల్ ఎస్సై సుధీర్ రావు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈత వనం దగ్ధం


దగ్ధమైన ఈత వనంలో గీత కార్మికులు

గంభీరావుపేట (ముస్తాబాద్), మే 9 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లె గ్రామంలో గౌడ సంఘానికి చెందిన ఈతవనం దగ్ధమైంది. సమీప వ్యవసాయ పొలంలో కొయ్యకాళ్లను తగలబెడుతున్న క్రమంలో ఈతవనంకు మంటలు వ్యాపించడంతో దాదాపు 300 ఈత, తాటిచెట్లు దగ్ధమయ్యాయి. ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని గౌడ సంఘం అధ్యక్షుడు బైరి శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు బండి లక్ష్మణ్‌గౌడ్, నర్సాగౌడ్, అంజాగౌడ్, భాస్కర్ గౌడ్, వెంకటేష్‌గౌడ్, రాములు గౌడ్ కోరారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడికి గాయాలు

బీర్‌పూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపు తప్పి యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. బీర్‌పూర్ మండలం లోని ఇందిరానగర్ గ్రామానికి చెందిన పూడూరి విజయ్ కుమార్ శుక్రవారం కమ్మునూర్ బ్రిడ్జి నుంచి బీర్‌పూర్ వైపు వె ళ్తుండగా కమ్మునూర్ చౌరస్తా వద్ద వాహనం అదుపు తప్పి ప్రమాదానికి గురయ్యాడు. గమనించిన గ్రామస్థులు జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

పసుపు సాగుకు జై..

- ఈ సీజన్‌లో జగిత్యాల జిల్లాలో 50 వేల ఎకరాల్లో సాగు అంచనా
- దుక్కులు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- విత్తన పసుపునకు భలే డిమాండ్
- క్వింటాలుకు రూ.6 వేల చొప్పున విక్రయం


జగిత్యాలలో సాగవుతున్న పసుపు పంట(ఫైల్)

జగిత్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లాలో పచ్చబంగారం సాగు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. తొలకరి రాగానే జూన్ మొదటి వారంలో పసుపు విత్తడం ఆరంభమవుతుంది. రైతులు ఇప్పటికే దుక్కులు సిద్ధం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఐదేళ్లుగా సాగు విస్తీర్ణం తగ్గుతూ రాగా ఈసారి మాత్రం పసుపు పంట వేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గతంలో గిట్టుబాటు ధర దక్కక సాగుకు దూరమైన వారు తిరిగి వేసేందుకు ఆలోచన చేస్తున్నారు. ఈ సీజన్‌లో అనూహ్యంగా రికార్డు స్థాయి ధరలు నమోదు కావడంతో పసుపు రైతుల్లో ఆశలు పెంచింది. రైతులు ప్రస్తుతం విత్తనం సేకరించే పనుల్లో ఉన్నారు.


దుక్కి దున్నుతున్న రైతులు

ఐదేళ్ల తర్వాత మార్పు

జగిత్యాల జిల్లాలో గడిచిన నాలుగు, ఐదు సంవత్స రాల్లో 35 వేల నుంచి 40 వేల ఎకరాల్లో సాగు అయ్యేది. మద్ద తు ధరలు అంతంత మాత్రం గానే ఉండడంతో గత సీజన్‌లో 25 వేల ఎకరాలకు పడి పోయింది. ప్రస్తుత సీజన్‌లో పసుపు ధర పుంజుకొని సరాసరి రూ.13 వేల నుంచి రూ. 20 వేల వరకు ధర పలి కింది. కొమ్ముకే కాదు, మండ పసుపుకు కూడా డిమాండ్ రావడంతో రైతులను ఇటు వైపు మొగ్గు చూపేలా చేస్తోందని అధికారులు అంటున్నారు. పసుపునకు ఆశించిన ధర రావడం, పసుపు బోర్డు ఏర్పాటు కావడం తదితర కారణాల వల్ల ఈ ఏడాది గతంలో కంటే సాగు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. జగిత్యాల జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో పసుపు సాగు అయ్యే అవకాశాలున్నాయని వ్యవసాయ, ఉద్యా నవన శాఖ వర్గాలు అంటున్నాయి.

చిగురిస్తున్న ఆశలు

పసుపు రైతులకు ఈ ఏడాది వరస నష్టాల నుంచి ఉపశమనం లభించింది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర దక్కడంతో చేసిన కష్టానికి ప్రతిఫలం దక్కింది. రైతుల్లో సాగుపై మళ్లీ ఆశలు చిగురించాయి. ఈసారి సాగు విస్తీర్ణం రెట్టింపు అయ్యే అవకాశాలు కనిస్తున్నాయి. దీంతో విత్తన పసుపునకు డిమాండ్ ఏర్పడింది. గతేడాది క్వింటాకు రూ. 4 వేలు ఉన్న విత్తన పసుపు ధర ఇప్పుడు రూ.6 వేలు పలుకుతోంది. కొనుగోలుకు పసుపు రైతుల్లో ఆసక్తి ఉన్నా విత్తనం దొరకడం లేదు.

పసుపు సాగు పెరుగుతోంది


సోమ శ్రీనివాస్, పసుపు రైతు, గోదూరు గ్రామం, జగిత్యాల్ల

ప్రస్తుత సీజన్‌లో పసుపు సాగు పెరగనుంది. పసుపునకు మార్కెట్‌లో అధిక ధరలు రావడం, పసు పు బోర్డు ఏర్పాటు తదితర అంశాలు పసుపు సాగు పెరగడానికి కారణంగా మారింది. పలువురు రైతులు పసుపు సాగు చేయడానికి మొగ్గు చూపుతు న్నారు. ఇప్పటికే దుక్కులు దున్ని సిద్ధంగా ఉన్నారు.

రెస్టారెంట్లు, టిఫిన్‌సెంటర్లపై మున్సిపల్ అధికారుల దాడులు

- రూ.18 వేల జరిమానా

కోరుట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని పలురెస్టారెంట్లు, బేకరీ, టిఫిన్‌సెంటర్లు, హోటళ్లు, ప్లాస్టిక్ దుకాణాలపై శుక్రవారం మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. తినుబండారాలను, సింగిల్‌యూస్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని రూ.18,000జరిమానాలు విధించారు. ఈ సందర్భంగామున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్ మాట్లాడుతూ సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. ట్రేడ్‌లైసెన్స్ లేనివారు వెంటనే తీసుకోవాలని సూచించారు. తడి,పొడి, హానికరమైన చెత్తగా వేరుచేసి దుకాణాలకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని లేనిచో జరిమానాలను విధిస్తామని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలేఅశోక్, రాజేంద్రప్రసాద్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్‌మహేష్, సిబ్బంది హేమంత్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగుట్రాక్టర్లను శుక్రవారం పట్టుకున్నట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్లు, యజమానులపై కేసులు నమోదుచేశామని పేర్కొన్నారు. ఇసుక ట్రాక్టర్లను సీజ్‌చేసినట్లు తెలిపారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

- ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుల ధర్నా


ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లో ధర్నా చేస్తున్న కార్మికులు

జ్యోతినగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ పర్మినెంటు టౌన్‌షిప్(పీటీఎస్)లో తొలగించిన కాంట్రాక్టుకార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ జిల్లా కాంట్రాక్టు కార్మికులసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. టౌన్‌షిప్ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో 100 మంది కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లుక శంకర్ మాట్లాడుతూ ఇటీవల టౌన్‌షిప్‌లోని వివిధ జోన్లకు సంబంధించి టెండర్లలో మ్యాన్ పవర్‌ను తగ్గించి కాంట్రాక్టర్లకు పనులు అప్పగించడంతో కార్మికులు అయోమయంలో పడ్డారన్నారు. కొత్త టెండర్లలో కార్మికులను తగ్గించి టెండర్లను పిలవడంతో మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్న కొంత మంది కార్మికులను తొలగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్టీపీసీ యాజమాన్యం ఇచ్చిన ఆదేశాల మేరకు 60 సంవత్సరాలు దాటిన కార్మికుల పిల్లలకు డిపెండెంటు ఎంప్లాయ్‌మెంట్ కింద పనులు కల్పించిందని, దీంతో చాలామంది కార్మికులు తమ వారసులను తమస్థానాల్లో ఉద్యోగాలు కల్పించారన్నారు. కొత్త టెండర్లలో డిపెండెంట్ ఎంప్లాయ్‌మెంట్ కింద చేరిన వారిని చేర్చలేదన్నారు. దీనివల్ల ఆకార్మికులను తొలగించేందుకు సదరు కాంట్రాక్టర్లు సిద్ధయయ్యారన్నారు. ఇప్పటికే కొంతమంది కార్మికులను విధుల నుంచి తొలగించారని తెలిపారు. కొత్త టెండర్లతోపాటు పాత టెండరులో ఉన్న అందరు కార్మికులను చేర్చి కార్మికులకు న్యాయం చేయాలని శంకర్ డిమాండ్ చేశారు. లేకుంటే సోమవారం నుంచి ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. తాము టౌన్‌షిప్‌లో విధులుబహిష్కరిస్తే ఎన్టీపీసీ యాజమాన్యమే బాధ్యత వహించాలని, తప్పని పరిస్థితుల్లో తాము విధులు బహిస్కరంచాల్సి వస్తున్నదన్నారు. 2022లో ఎన్టీపీసీ యాజమాన్యంతో జరిగిన ఒప్పందం ప్రకారం 1,020 రూపాయల అలవెన్సులను కార్మికులకు చెల్లించడం లేదని, 16 నెలల ఏరియర్స్‌ను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. టౌన్‌షిప్‌లోని నాలుగు జోన్లను క్లబ్ చేసి ఎ రాజేశం అనే కాంట్రాక్టరుకు పనులను అప్పగించారన్నారు. ఈ విషయంలో యాజమాన్యం స్పందించి చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చన్న, స్వామి, రవి, కృష్ణ, మొండయ్య, ఓదెలు, నర్సయ్య, రమేష్, శంకర్, చిరంజీవి, రాయమల్లమ్మ, సూరమ్మ, ఓదెమ్మ, హైమవతి, పద్మ, స్వరూప, సంధ్య, సరోజన, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ముత్తారం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగయ్య పల్లి మూల మలుపు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు కాగా మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. గోదావరిఖనికి చెందిన శత్రువేదుల శ్రావణ్ తన సోదరుడు శశిధర్ కలిసి భూపాలపల్లి జిల్లా జంగ పల్లికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి-మంథని ప్రధాన రహదారి రంగయ్యపల్లి మూలమలుపు వద్ద ఉన్న టేకు చెట్లను ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. బైక్ నడుపుతున్న శ్రావణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. శశిధర్‌కు స్వల్ప గాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108కి సమాచారం ఇవ్వగా గాయపడ్డ వారిని మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రయాణికురాలిపై కోతుల దాడి

ఓదెల, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఓప్రయాణికురాలిపై కోతులు దాడిచేయ డంతో తీవ్రగాయాలయ్యాయి. కొత్తగూడెంకు చెందిన బండి స్రవంతి రైల్వే స్టేషన్‌లోని కౌంటర్‌వద్దకు టికెట్ కోసం వెళుతున్న క్రమంలో కోతులు అకస్మాత్తుగా దాడిచేసి నోటకరిచాయి. దీంతో మహిళ ముఖంపై తీవ్రగాయాలయ్యాయి. పొత్కపల్లికి చెందిన బంధువు గూడెపు సంజీవరెడ్డి ఇంటికి వచ్చి తిరిగి వెళుతున్న క్రమంలో ఇక్కడి రైల్వేస్టేషన్‌లో సంఘటన చోటుచేసుకుంది. గాయాలకు గురైన మహిళను జమ్మికుంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో రైతుకు గాయాలు


గాయపడ్డ రైతు కొమురయ్య

తంగళ్లపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామానికిచెందిన రైతు జీల కొమురయ్య(48) విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. తన పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజు పోవడంతో విద్యుత్‌సరఫరా నిలిచిపోయింది. త్వరగా ఫ్యూజువేసి విద్యుత్‌సరఫరా పునరుద్ధరించి తనపొలానికి నీరు అందించాలని భావించి ట్రాన్స్‌పార్మర్‌కు ఫ్యూజు వేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో కొమురయ్య తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ రైతును భారతీయ కిసాన్ జిల్లా అధ్యక్షుడు పులి లక్ష్మీపతిగౌడ్, కార్యదర్శి బియ్యంకార్ శ్రీనివాస్‌లు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ శాఖకు సంబంధించిన హెల్పర్ స్పందించి ట్రాన్స్‌పార్మర్‌కు మరమ్మతులు చేయాల్సి ఉండగా నిర్లక్ష్యంగా వ్యవహరించాడని ఆరోపించారు. హెల్పర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతు మరమ్మతులుచేసే క్రమంలో విద్యుత్ గురయ్యాడన్నారు. ఈసంఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరిపించి రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

చెరువు మట్టి.. చేనుకు పుష్టి

చేలలో భూసారం పెరుగుదలకు దోహదం..


చేనులో చెరువు మట్టి

చొప్పదండి, మే 9 (ఆంధ్రజ్యోతి): చెరువు మట్టి పంట చేలకు ఎంతో మేలు చేస్తుంది. ఎర్రనేలలో చెరువు మట్టి పోస్తే చేనుకు పుష్టి చేకూరుతుంది. ఎండాకాలంలో నీరంతా ఇంకిపోయి చెరువు ఎండిపోగానె పూడికతీత పనులను ప్రారంభిస్తారు. ఆ మట్టిని రైతులు తమ పొలాల్లో పోసుకుంటున్నారు. రైతులు తమ పంట చేనులో చెరువుమట్టిని వేసుకుంటే అనేక ప్రయోజనాలున్నాయి. వర్షాలు పడినప్పు డు అనేక పోషకవిలువలు కలిగిన సారవంత మైన మట్టి చెరువులోకి వచ్చి చేరుతుంది. ప్రస్తుతం గ్రామాల్లోని చెరువుల్లో పూడిక పనులు ప్రారంభంకానున్న నేపథ్యంలో చెరువు మట్టి ప్రాముఖ్యత వివరాలు..

చెరువు మట్టితో ప్రయోజనాలు..

- చెరువు మట్టితో రైతుల పంట దిగుబడి పెరుగుతుంది.
- చెరువు మట్టిని చేనులో పోయడం ద్వారా ఆమ్ల, క్షార గుణాలను తటస్థంగా మారతాయి.
- నేలలోని లవణాల ఘాడత తగ్గుతుంది.
- మట్టితో పాటు సేంద్రియ ఎరువు కలిపి వేసుకుంటే రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు.
- మొక్కలు ఆరోగ్యంగా ఏపుగా పెరుగుతాయి.
- కలుపు, వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనే శక్తి నేలకు కలుగుతుంది.
- దిగుబడి పెరిగి రైతులకు అధిక ఆదాయం వస్తుంది. నేల సార వంతంగా మారుతుంది.
- చెరువులో పూడిక మట్టి తరలింపుతో వర్షాకాలంలో నీటినిల్వలు పెరుగుతాయి. తద్వారా గ్రామంలో భూగర్భ నీటిమట్టం పెరుగుతుంది.

లారీ డ్రైవర్‌పై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

కరీంనగర్ క్రైం, మే 9(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద శుక్రవారం కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. మోతాదుకు మించి మద్యం తాగిన లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. లారీని వేగంగా నడుపుతూ నో ఎంట్రీ ప్రాంతంలోకి ప్రవేశించడాన్ని గుర్తించిన పోలీసులు బ్రీత్‌ఎనలైజర్‌తో డ్రైవర్‌ను పరీక్షించారు. మోతాదుకు మించి అత్యధికంగా 100 ఎంఎల్ రక్తంలో 550 మిల్లీ గ్రాముల ఆల్కాహాల్ ఉన్నట్లు వెల్లడైంది. దీంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు, లారీని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. తనిఖీల్లో సీఐ పర్శ రమేష్, ఎస్సై ఇషాక్ అమ్మద్ పాల్గొన్నారు.

రూ.7410 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7410 పలికింది. నలుగురు రైతులు 36క్వింటాళ్లు విడిపత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగ వేలంపాట ద్వార గరిష్ఠ ధర రూ.7410, కనిష్ఠ ధర రూ.6950 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఏసీబీ వలకు చిక్కిన అవినీతి అధికారి

- రూ.60వేలు లంచం తీసుకుంటుండగా అదుపులోకి


ఏసీబీకి పట్టుబడిన ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, మే 9 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదలశాఖలో అవినీతి అధికారిని కరీంనగర్ అవినీతి నిరోధకశాఖ పోలీసు అధికారులు వలవేసి పట్టుకున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా నీటిపారుదల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ)గా పనిచేస్తున్న ఎర్రంరెడ్డి అమరేందర్ రెడ్డి శుక్రవారం రాత్రి ఒక కాంట్రాక్టర్ నుంచి రూ.60వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ పోలీసులకు పట్టుబడ్డాడు. నీటిపారుదల శాఖలో రాజన్నసిరిసిల్ల జిల్లాలోని డివిజన్-7 ఆవునూర్, అగ్రహారం గ్రామాల్లో చెక్‌డ్యాం నిర్మాణంకు సంబంధించిన రూ.50లక్షల బిల్లు ఎంబీరికార్డు చేసేందుకు కాంట్రాక్టర్‌ను ఈఈ ఎర్రంరెడ్డి అమరేందర్‌రెడ్డి కొద్దిరోజులుగా లంచం డబ్బుల కోసం వేధిస్తున్నాడు. దీంతో బాధితుడు ఏసీబీ పోలీసులను ఆశ్రయించాడు. రూ.50లక్షల బిల్లుమంజూరు కోసం లక్ష రూపాయలు డిమాండ్ చేయగా చివరకు 75వేల రూపాయలకు ఒప్పందం కుదిరింది. లంచం డబ్బులు ఇంటివద్ద ఇవ్వాలని చెప్పగా ఏసీబీ పోలీసుల సూచన మేరకు రాత్రి 8గంటల ప్రాంతంలో లంచం డబ్బులు రూ.60వేలు కరీంనగర్ విద్యారణ్యపురిలో ఈఈ అమరేందర్ రెడ్డి ఇంటివద్ద కాంట్రాక్టర్ ఇస్తుండగా కరీంనగర్ అవినీతి నిరోదకశాఖ డీఎస్పీ వీవీ రమణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు మాటువేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఇదే చెక్‌డ్యాంకు సంబంధించిన రూ.5కోట్ల రూపాయల బిల్లురికార్డు చేసేందుకు ఈఈ ఇంతకుముందు4లక్షల రూపాయలు బాధితుడి నుంచి తీసుకున్నాడని ఏసీబీ డీఎస్పీ తెలిపారు. లంచంకు సంబంధించిన రూ.60 వేల నగదును సీజ్‌చేశారు. నిందితుడు ఈఈ అమరేందర్‌రెడ్డిని అరెస్టుచేసన ఏసీబీ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. శనివారం కరీంనగర్ ఏసీబీకోర్టులో అతడిని హాజరు పరుచనున్నట్లు తెలిపారు.

లంబడితండా(బి)లో ఎక్సైజ్ దాడులు


పట్టుకున్న గుడుంబాతో ఎక్సైజ్ అధికారులు

ధర్మారం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబాడితండా(బి) గ్రామంలో ఎక్సైజ్ శాఖ-డిస్ట్రిక్టటాస్కఫోర్స్ సంయుక్తంగా గుడుంబా స్థావరాలపై శుక్రవారం దాడులు నిర్వహించింది. ఈ దాడుల్లో 18 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోగా, ఇద్దరు వ్యక్తులు పరారీలో ఉన్నట్లు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ జీవన్‌రెడ్డి తెలిపారు. ఈ దాడుల్లో డిస్ట్రిక్ట్ టాస్కఫోర్స్ ఎస్‌ఐ పావనితోపాటు పదిమంది సిబ్బంది పాల్గొన్నారు. ఎవరైన నాటుసారా, గుడుండా తయారుచేస్తే వారిపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని డిస్ట్రిక్ట్ టాస్కఫోర్స్ ఎస్‌ఐ పావని హెచ్చరించారు.

సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలి

కరీంనగర్ రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మైనార్టీ గురుకులాల్లో కల్పిస్తున్న సౌకర్యాలపే సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ గురుకుల ఆర్‌ఎల్‌సీ కనపర్తి సురేష్ కుమార్ అన్నారు. శుక్రవారం అస్లాం మసీద్ దగ్గర ఇరుకుల్ల మైనార్టీగురుకుల పాఠశాలలో కల్పిస్తున్నసౌకర్యాలపై ఉపాధ్యాయ బృందంతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో అల్పసంఖ్యాకులు అందరితో సమానంగా ఎదగడానికి గురుకులాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ కో-ఆర్డినేటర్ మహేందర్, కాలేజ్ కో-ఆర్డినేటర్ రాజు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే దొంగల బీభత్సం

- రూ.30 వేల నగదు, రూ.3.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాల అపహరణ

ఎల్లారెడ్డిపేట, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శుక్రవారం పట్టపగలే దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామంలో తాళం వేసి ఉన్న వొద్దిరాల శ్రీనివాస్ ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడ్డారు. బీరువా, ఇతర వస్తువులను చిందరవందరగా పడేశారు. ఇంటిలో దాచుకున్న రూ.30 వేల నగదు, రూ.3.50 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను ఎత్తుకొనిపోయారు. శ్రీనివాస్, తన భార్య ఇద్దరు బస్టాండు ప్రాంతంలో కర్రీ పాయింట్‌తో పాటు చపాతీలు తయారుచేస్తూ జీవిస్తున్నారు. ఉదయం ఇంటికి తాళం వేసి దుకాణానికి చేరుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉన్నదంతా ఊడ్చుకుపోయారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పట్టపగలే చోరీకి పాల్పడడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఎన్టీపీసీ ప్లాంటులో విపత్తు జరిగితే ఎదుర్కొంటాం

రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా



మాక్ డ్రిల్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

జ్యోతినగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ ప్లాంటులో ఏదైనా అనుకోని ఘటనలు జరిగితే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రతీ క్షణం అధికార యంత్రాంగం, సిబ్బంది సన్నద్ధంగా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు శుక్రవారం సాయంత్రం ఎన్టీపీసీ ప్రాజెక్టు ఆవరణలో భద్రతా సిబ్బందితో సీపీ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అనుకోని దుస్సంఘటన జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండడంలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి మాక్‌డ్రిల్ నిర్వహించినట్లు సీపీ పేర్కొన్నారు. ఏదైనా ప్రమాదం, అగ్ని ప్రమాదాలు జరినప్పుడు భద్రతా దళాలు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే అంశాలను మాక్‌డ్రిల్ ద్వారా వివరించామన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఎన్టీపీసీ ఎస్‌ఐ ఉదయ్ కిరణ్, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్



డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న సీఐఎస్ఎఫ్ జవాను

జ్యోతినగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టు ఆవరణలో సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. పాకిస్తాన్‌తో యుద్ధం జరుగుతున్న క్రమంలో ఏదైనా విపత్తు జరిగితే తీసుకోవాల్సిన చర్యలకు సంబంధించి మాక్ డ్రిల్ నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు, ప్రాజెక్టు పరిసరాల్లో, పని స్థలాల్లో తనిఖీలు తదితర అంశాలను మాక్ డ్రిల్‌లో ప్రదర్శించారు. సీఐఎస్ఎఫ్ రావగుండం ఎన్టీపీసీ యూనిట్ సీనియర్ కమాండెంట్ అరవింద్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ అంజనేయరాజు, డిప్యూటీ కమాండెంట్ ఓవికె శాస్త్రి పర్యవేక్షణలో జరిగిన మాక్ డ్రిల్‌లో అసిస్టెంట్ కమాండెంట్లు జై కన్వర్, అకేశ్వర్‌సింగ్, ఇన్‌స్పెక్టర్లు, జవానులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధికి మహర్దశ

- చారిత్రక, పురాణాల ప్రాశస్త్యానికి ఇబ్బంది లేకుండా అభివృద్ధి
- మొదటి విడత రూ.76.73 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- భీమన్న ఆలయంలోనే భక్తులకు దైవ దర్శనాలు
- ప్రధాన గర్భాలయం ముట్టకుండా అభివృద్ధి పనులు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో నిధులు మంజూరు

వేములవాడ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి మహర్దశ పట్టనుంది. స్థానిక శాసన సభ్యుడు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కృషితో ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రాజన్న ఆలయ అభివృద్ధిని మూడు దశల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. తొలి దశ పనులను జూన్ మాసం నుంచి ప్రారంభించేందుకు నిర్ణయించారు. జూన్15వ తేదీ నుంచి రాజన్న ప్రధాన దేవాలయంలోకి భక్తులను అనుమతించరు. నిత్యపూజలను మాత్రం అర్చకులు ప్రధాన దేవాలయ గర్భాలయంలో నిర్వహిస్తారు.

భక్తులకు దైవ దర్శనాన్ని స్థానిక భీమేశ్వర స్వామి ఆలయంలో దర్శించుకు నేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. శృంగేరి పీఠాధిపతి సూచించిన మార్పులను పరిగణలోకి తీసుకుని చారిత్రక, పురాణాల నేపథ్యం ఉన్న భాగాలను, పురాతన గ్రంథాలు, పూర్వం రాతి శాసనాల్లో పేర్కొన్న విధంగా ప్రాశస్త్యానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అభివృద్ధిని విస్తరించేందుకు ముందుకు సాగుతున్నారు. పురాణ నేపథ్యం కలిగిన ధర్మగుండం, గుడి చెరువు ప్రాశస్త్యం తగ్గకుండా 40ఎకరాల్లో విడతల వారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. అన్నదాన సత్రం, క్యూ కాంప్లెక్స్‌లు, వసతిగృహాలు, రెండు ప్రాకారాలు, కార్యాలయం, కోనేరు, కల్యాణకట్ట, కోడె మొక్కుల ప్రాంతం వంటి వాటిని కొత్తగా నిర్మించనున్నారు. ఇందకు మూడు దశల్లో రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.550 కోట్ల వ్యయం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఆలయ విస్తరణకు రూ.76 కోట్లు, కల్యాణ మండపానికి రూ.33 కోట్లు, రోడ్ల విస్తరణ పనులకు రూ.47.86 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇటీవల బడ్జెట్‌లో మరో రూ.100కోట్లు ప్రభుత్వం ప్రతిపాదించింది.



వేములవాడ రాజన్న ప్రధాన ఆలయ ఊహాచిత్రం

శృంగేరి శంకరమఠం పీఠాధిపతి సూచనలతోనే..

చారిత్రక, పౌరాణిక నేపథ్యం ఉన్న భాగాలను, పురాణాలు, పురాతన గ్రంథాల, 1970లో వెలుగుచూసిన రాతి శాసనాల్లో పేర్కొన్న విధంగా ప్రాశస్త్యానికి ఎక్కడా ఇబ్బంది లేకుండా ఆలయ అభివృద్ధిని చేసేందుకు నిర్ణయించారు. ఆలయ విస్తరణ పనుల్లో వేములవాడ చాళుక్యుల శైలి మూర్తీ భవించేలా నిర్మాణం జరగనుంది.

తెలంగాణలో ఎంతో గొప్పగా నిర్వహించే బతుకమ్మ పండుగను రాష్ట్ర వ్యాప్తంగా 9 రోజులు జరుపుకుంటే వేములవాడలో మాత్రం 7 రోజులు నిర్వహిస్తారు. బతుకమ్మ పుష్పం నుంచే ఆలయం ఉద్భవించిందన్న పౌరాణికగాథ అనుగుణంగా బతుకమ్మ గుర్తులు ప్రతిబింబించేలా నిర్మాణం చేపట్టనున్నారు. సరైన ప్రణాళిక లేకపోవడంతో గతంలో ఆలయ పునరుద్ధరణ వంకరగా జరిగిందని, ప్రస్తుత విస్తరణ పనుల్లో రెండు ప్రాకా రాలు, రెండు వీధులతో క్రమ పద్ధతిలోకి మార్చనున్నారు. నాలుగు ఎకరాల్లో ఉన్న ఆలయాన్ని 4.6 ఎకరాలకు పెంచనున్నారు.

1979లో ఆలయ పునరుద్ధరణ..

వేములవాడ రాజన్న ఆలయ పునరుద్ధరణ 1979లో చేపట్టారు. ఆలయ సంప్రదాయ నిర్మాణ ఆధారంగా అప్పట్లో గర్భగుడి ద్వారాలు, రాజగోపురాలను ఆధునిక శైలిలో మరమ్మతులు చేసి ఆధునికీకరించారు. ధర్మగుండం, ఆలయ ప్రాంగ ణంలో ఉన్న పరివార దేవాలయాలు, కోటిలింగా లను ప్రత్యేక ఆకర్షణగా నిర్మించారు. కాగా భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలిచేలా ప్రస్తుతం ఆలయ అభివృద్ధి ఉండనుంది. పురాతన శిల్పకళ, శైవ సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆలయాన్ని విస్తరించనున్నారు. రాజన్న ఆలయాన్ని సౌందర్యానికి ప్రతిరూపంగా రూపుదిద్దేలా ప్రణాళికలు చేస్తున్నారు. ధర్మగుండం మధ్యలో శివుడి విగ్రహం, భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని అందించడం కోసం ధర్మగుండం చుట్టూ పార్క్, నడక మార్గాలతో పాటు ఆకట్టుకునే డిజైన్‌లను తయారు చేస్తున్నారు.





భీమేశ్వర స్వామి ఆలయం

చరిత్రలో నిలిచేలా రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం..

వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



దక్షిణభారత దేశంలోనే ప్రముఖ శైవ క్షేత్రంగా వేములవాడ రాజన్న ఆలయం కొనసాగుతోంది. నిత్యం వేల సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివస్తున్నారు. రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేయాలనేది నా చిరకాల వాంఛ. దాని కోసం ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను. నేను ఎమ్మెల్యేగా ఉండగా ఆలయ అభివృద్ధి జరగడం ఎంతో సంతోషంగా ఉంది. వచ్చే వెయ్యి ఏళ్ల గుర్తుండేలా ఆలయ విస్తరణ చేయాలని అనుకుంటున్నాము. రాజన్న ఆలయ అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డితోపాటుగా ఎనిమిది మంది మంత్రులతో శంకుస్థాపన కార్యక్రమాలను చేసుకున్నాము. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భీమేశ్వర ఆలయంలో దైవ దైర్శనం కల్పిస్తాము. ఎంతో చారిత్రక, పురాణ నేపథ్యం కలిగి ఉన్న విభాగాలను ముట్టకుండా శృంగేరి శంకరమఠం పీఠాధిపతుల సూచనలు, సలహాల మేరకే ఆలయ విస్తరణ పనులను చేపడుతున్నాము.



గుడి చెరువు అభివృద్ధి ఊహాచిత్రాలు

పవర్ లిఫ్టింగ్‌లో సిరిచందనకు కాంస్యం



సాధించిన పతకం ప్రశంస పత్రంతో సిరిచందన

కరీంనగర్ స్పోర్ట్స్, మే 9 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన తుడి సిరిచందన కాంస్య పతకం సాధించింది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఈ నెల 6 నుంచి 12 వరకు నిర్వహించిన ఏషియన్ జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గంగాధర మండలం మర్రిగడ్డకు చెందిన సిరిచందన 52 కేజీల విభాగంలో 330 కిలోల బరువును ఎత్తి కాంస్యం సాధించింది. గత డిసెంబరు 16 నుంచి 19 వరకు ఢిల్లీ సర్దార్ సింగ్ స్టేడియంలో నిర్వహించిన పవర్‌లిఫ్టింగ్ ఇండియా ఫెడరేషన్ కప్ జాతీయ చాంపియన్‌షిప్‌లో 330 కిలోల బరువు ఎత్తి రజతం సాధించింది. దీంతో ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు భారత జట్టు తరఫున ఆమె ఎంపికైంది. ఈ సందర్భంగా జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్, ఎస్సారార్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, ఫిజికల్ డైరెక్టర్ నాగేశ్వర్‌రావు, పవర్ లిఫ్టింగ్ కోచ్ భీమనాతిని మల్లేశం అభినందించారు.



ఏషియన్ పవర్ లిఫ్టింగ్ పోటీల వేదికపై సిరిచందన

మానసాదేవి ఆలయంలో కొనసాగుతున్న వార్షికోత్సవం

గన్నేరువరం, మే 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న సప్తమ వార్షిక వేడుకలు రెండోరోజు శుక్ర వారం కొనసాగాయి. ఈ వేడుకల్లో ఉదయం చండీ హోమం, 108మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన, మానసాదేవికి లక్ష పుష్పార్చన, మహేశ్వరునికి భస్మాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వేడుకలకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలు కల్పించి అన్నదానం నిర్వ హించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, నాయకులు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కొమ్మెర రవిందర్‌రెడ్డి, పులి కృష్ణ, అలువాల కోటి, బద్దం సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.



మానసాదేవి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

- వాకింగ్‌తో పలు ప్రయోజనాలు
- నేడు వరల్డ్ మూవ్ ఫర్ హెల్త్ డే

నడకతో ఆరోగ్యం



కరీంనగర్ స్పోర్ట్స్, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జీవన విధానంలో ప్రజలకు తగిన వ్యాయామం లేక శరీరంపై నియంత్రణ లేకుండాపోతోంది. ప్రజలు బీపీ, షుగర్, స్థూల కాయంతో పడుతున్నారు. ప్రతి రోజు కనీసం 45 నిమిషాలు నడవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పుడిప్పుడే ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన పెరుగుతోంది. నడకను తమ జీవితంలో భాగంగా చేసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం మైదానాలు, ఖాళీ స్థలాలు, రహదారుల వెంట చిన్న, పెద్ద, ఆడ, మగ తేడా లేకుండా వాకింగ్ చేస్తున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది.

- **ఉపయోగాలు:** నడక మన శరీర నిర్మాణాన్ని మార్చుతుంది. నడకతో చాలా రకాల ఉపయోగాలున్నాయి. గుండెజబ్బులు, మధుమేహం, మానసిక ఒత్తిడి, రక్తపోటు, స్థూలకాయం రాకుండా చూస్తుంది. శరీరంలోని కొవ్వును తగ్గించి జీవిత కాలాన్ని పెంచుతుంది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రధాన పట్టణాలతోపాటు పల్లెల్లో కూడా యువత, పెద్దలు నడకను జీవితంలో ఒక భాగంగా చేసుకుంటున్నారు. ప్రత్యేకించి ఇటీవలి కాలంలో 35 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు వారు, వృద్ధులు ఆసక్తి చూపుతున్నారు.
- **నేపథ్యం:** నడక ప్రాధాన్యాన్ని గుర్తిం చిన ప్రపంచ ఆరోగ్య సంస్థ 2002 మే 10న నిర్వహించిన సమావేశంలో వ్యాయామం, ఆరోగ్యం, ఆహారం అంశాల మీద చర్చించింది. ఆహార నియమాలతో పాటు నడక వ్యాయామాలపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం మే 10న వరల్డ్ మూవ్ ఫర్ హెల్త్ డే జరుపుకోవాలని సూచించింది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం మే10న నడక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

వాకింగ్ ప్రారంభం ఇలా...

- వాకింగ్ ప్రారంభించే వారు మొదటి రోజు 5 నుంచి 15 నిమిషాలు నడిచి క్రమేపి సమయాన్ని పెంచాలి.
- షూస్ తప్పని సరిగా ధరించాలి.
- వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తే ఆరోగ్యానికి మంచిది.
- రహదారులపై వాకింగ్ చేయడం కంటే మైదానాలలోనే వాకింగ్ చేయడం మంచిది.



వాకింగ్ చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- నడిచేటప్పుడు చేతులు ఊపుతూ శరీరాన్ని నిటారుగా ఉంచాలి.
- వాకింగ్ ఆపే ముందు వేగాన్ని క్రమేపి తగ్గించాలి.
- నడిచేటప్పుడు వదులుగా ఉండే దుస్తులనే ధరించాలి.
- ఆరోగ్య సమస్యలుంటే డాక్టర్ సలహాతో వాకింగ్ చేయాలి.
- ప్రతి రోజు 45 నిమిషాలు నడిస్తే మంచింది.
- పక్కవారితో సాధ్యమైనంత వరకు మాట్లాడకుండా ఉండాలి.
- నడిచేట ప్పుడు శ్వాసపై నియంత్రణ అవసరం.





నూతనోత్సాహం కలుగుతుంది..: ఎడ్ల మధు, వాకర్

వాకింగ్‌తో చేస్తే ఉత్సాహంగా ఉంటుంది. నడవని రోజు అసౌకర్యంగా ఉంటుంది. ఉదయమే ఏకాగ్రతతో నడవటం వల్ల ఇతర ఆలోచనలు దరి చేరవు. 10 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా మైదానంలో వాకింగ్ చేస్తున్నాను.

బీపీ, షుగర్ నార్మల్‌గా ఉంటాయి.. :ఎంఏ కరీం, వాకర్



ఎనిమిదేళ్లుగా ప్రతి రోజు వాకింగ్ చేస్తున్నాను. గతంలో కాళ్ల, కీళ్లనొప్పులుండేవి. ప్రస్తుతం అవేమి లేవు. అనారోగ్య ఇబ్బందులు లేవు. షుగర్, బీపీ నార్మల్‌గా ఉన్నాయి.

ధర్మపురిలో వైభవంగా అన్నకూటోత్సవం

ధర్మపురి, మే 9 (ఆంధ్రజ్యోతి): నరసింహ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో అన్నకూటోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, వ్యాసపూర్వక, శోడషోపచార పూజ, సహస్ర నామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. పంచోపనిషత్తులచే మన్యసూక్త, రుద్రాభిషేకం, విశేష పూజలు, సప్తహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పల్లవోత్సవం, వసంతోత్సవం కార్యక్రమంలో భాగంగా ప్రధాన ఆలయ మండపంలో అందంగా వివిధ రకాల చెట్ల కొమ్మలతో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేశారు. అర్చకులు స్వామి వారల ఉత్సవ మూర్తులను ప్రత్యేక పీఠపైకి తీసుక వచ్చి ఆశీనులు చేశారు. అనంతరం పంచామృతాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకాది కార్యక్రమాలు జరిపి పల్లవోత్సవం, వసంతోత్సవం నిర్వ హించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు



నివేదన కోసం తీసుకు వెళుతున్న అర్చకులు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 9 (ఆంధ్రజ్యోతి):వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు రాజన్న ఆలయంలోని ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని శ్రీపార్వతి పరమేశ్వరులను దర్శించుకున్నారు. కోడె మొక్కులు చెల్లించుకున్నారు.



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుమన్



ఆంధ్రజ్యోతి: ఎండలో పనులు చేసే వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

సూపరింటెండెంట్: కూలీలు ఎండదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. పని చేసే టప్పుడు కచ్చితంగా తలకు రుమాలు చుట్టుకోవాలి. ఎప్పటికప్పుడు నీరు తాగుతూ ఉండాలి.

ఆంధ్రజ్యోతి: వడదెబ్బ బాధితులకు ఎలాంటి చికిత్స అందిస్తారు?

సూపరింటెండెంట్: వడదెబ్బకు గురైతే ఓఆర్ఎస్ ద్రావణం ఎక్కువగా తాగాలి. బాధితుల చికిత్సకు కావాల్సిన మందులు సిద్ధంగా ఉంచాం. ఇప్పటి వరకు వడదెబ్బకు గురైన వారు జిల్లా ప్రధాన ఆసుపత్రికి రాలేదు.

-జగిత్యాల అర్బన్

వైభవంగా బ్రహ్మంగారి కల్యాణం

కొడిమ్యాల, మే9(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో శుక్రవారం కొడిమ్యాల విశ్వబ్రాహ్మణ సంఘం(కర్రపని)వారి ఆధ్వర్యంలో గోవింద మాంబబ్రహ్మంగారి కల్యాణం పండితులు వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, నిర్వహకులు గ్రామస్తులకు అన్నదానం చేశారు. ఉదయం నుండి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

పెగడపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. మండలంలోని మద్దులపల్లి గ్రామంలోని ఐకేపీ, సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాములుగౌడ్ శుక్రవారం పరిశీలించారు. తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని త్వరితగతిన తూకం పూర్తి చేసి, వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, పార్టీ యూత్ అధ్యక్షులు అనీల్ గౌడ్, తిరుపతి, ఐలయ్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

మల్యాల, మే9 (ఆంధ్రజ్యోతి): మల్యాలలో పునర్నిర్మాణం చేపట్టనున్న పెద్దమ్మ ఆలయానికి తుడి లచ్చన్న అనే సామాజికవేత్త ముదిరాజ్ సంఘ ప్రతినిధులకు రూ.20వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూనవేణి రాజశేఖర్, బొట్ల ప్రసాద్, టీఎల్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్రీడా మైదానాలు

-పల్లెప్రకృతి వనాల్లో ఎండుతున్న మొక్కలు -పట్టించుకోని ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు



క్రీడా పరికరాలు లేని రేకులపల్లి క్రీడా మైదానం



రేకులపల్లి పల్లె ప్రకృతివనంలో ఎండిపోయిన మొక్కలు

బీర్‌పూర్, మే 9 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో క్రీడా మైదానాలు, పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసినా బీర్‌పూర్ మండలంలో అవి నిరుపయోగంగా తయారయ్యాయి. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు, క్రీడా మైదానాలు, తడి చెత్త పొడి చెత్త కేంద్రాలు, డంపిగ్ యార్డ్‌లు, వైకుంఠధామాలను కోట్ల రూపాయల ధనాన్ని వెచ్చించి మండలంలోని ప్రతి గ్రామంలో ఏర్పాటు చేశారు. అప్పటి అధికారులు హడావుడిగా గ్రామాల్లో పనులను ప్రారంభించినా వాటి నిర్వహణ పూర్తిగా మర్చిపోయారు. బీర్‌పూర్ మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో పంటలు సాగు చేయడం, కొల్వాయి గ్రామంలోని క్రీడా మైదానానికి ఏర్పాటు చేసిన బోర్డు ఏకంగా తొలగించి పక్కన పడేశారు. రేకులపెల్లి గ్రామంలో క్రీడామైదానం లేకపోయినా బోర్డును ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. అదేవిదంగా కమ్మునూర్‌లో గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన వైకుంఠదామం నీటి ప్రవాహానికి పూర్తిగా కొట్టుకొని పోయింది. అదేవిందగా కొల్వాయి గ్రామంలోని వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనం వరదల కారణంగా పూర్తిగా కొట్టుకొని పోయాయి. నర్సింహాపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వైకుంఠధామం ప్రారంభం కాకముందే పై కప్పులు లేచిపోయాయి. ఏ గ్రామంలో ప్రకృతి వనాలను చూసినా మొక్కల సంరక్షణ లేక ఎండిపోతున్నాయి. కొన్ని గ్రామాల్లో పిచ్చి మొక్కలు తొలగించే వారు లేక పెరిగిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, క్రీడా మైదానాలను వినియోగంలోకి తెచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు



దాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీవో మనోజ్

మెట్‌పల్లి రూరల్, మే, 9 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకోబడునని డీసీవో మనోజ్‌కుమార్ నిర్వహకులను హెచ్చరించారు. శుక్రవారం మెట్‌పల్లి విశాల సహకార సంఘం ఆధ్వర్యంలో మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఆర్ శ్రీనివాస్ ఆయన సందర్శించారు. కేంద్రంలోని ధాన్యం కుప్పలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన తేమ శాతంతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని నిర్వహకులను ఆదేశించారు. మార్కెట్‌కు వచ్చే ధాన్యం మ్యాచర్ వచ్చిన వాటిని సీరయల్ ప్రకారం కొనుగోలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌సీఎస్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు హన్మాండ్లు, మారుతి, సీఈవో ప్రవీణ్‌కుమార్‌గౌడ్, నిర్వహకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

ధర్మపురి, మే 9 (ఆంధ్రజ్యోతి): నరసింహ స్వామి నవరాత్రోత్సవాలు పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు వ్యాపారి కొండ రవీందర్-భవాని దంపతుల ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ ప్యాకెట్లు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసిన రవీందర్-భవాని దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తలు బొల్లారపు పోచయ్య, రాపర్తి సాయికుమార్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు

కోరుట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అతి పురాతన దేవాలయమైన వేంకటేశ్వర దేవాలయంను శుక్రవారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సందర్శించారు. దేవాలయంకు విచ్చేసిన ఆది శ్రీనివాస్‌కు దేవాలయ అర్చకులు బీర్నంది నరసింహాచారీ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రభుత్వ విప్‌ను ఆశీర్వదించిన అర్చకులు దేవాలయ జ్ఞాపికను అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటి సభ్యులు ఎతిరాజం నర్సయ్య, ఈఓ విక్రం, దర్మకర్తలు కట్కం దివాకర్, చిలువేరి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

మానాలలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'

మల్యాల, మే 9(ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంను శుక్రవారం మండలంలోని మానాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఉద్యానవన అధికారి జీ.శ్యామ్‌ప్రసాద్ ఆయిల్‌పామ్ సాగుపై వివరించి సాగు ప్రయోజనలు, పంట రాయితీల గురించి రైతులకు తెలిపారు. నీటి యాజమాన్యం, పంటల మార్పిడితో కలిగే ప్రయోజనాలు, చెట్ల పెంపకంతో ఏర్పడే పర్యవరణ సమతుల్యత, అధిక నత్రజని, రసాయన ఎరువుల వల్ల కలిగే దుష్ప్రభావాలు, పురుగుమందులు, రసాయన ఎరువులు తదితర వాటిపై రైతులకు శాస్త్రవేత్తలు రజనీకాంత్, సాయినాథ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ స్వాతి, ఏవో చంద్రదీపక్, ఏఈవోలు మంజుల, శ్రీనివాస్, కారుణ్యకుమార్, లోహియ కంపెనీ ప్రతినిధి ఎన్, అనిల్‌కుమార్, వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.



ఫ్లెక్సీ ప్రదర్శిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

మురుగు..కనుమరుగు

(ఐదో పేజీ తరువాయి)

నీటితో నిండిపోకుండా ఉంటాయి. గాలిలో దుమ్ము, మట్టి తక్కువగా ఉండడం వల్ల ప్రజలు ఆరోగ్యానికి ఇబ్బంది కలగదు. పట్టణంలో గాలి స్వచ్ఛంగా ఉండే అవకాశాలున్నాయి. భవిష్యత్తులో అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయి. పట్టణంలో ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించే అవకాశాలుంటాయి.

● నిధుల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్..

జగిత్యాల పట్టణ సమగ్రాభివృద్ధికి రూ.400 కోట్లు మంజూరు చేయడానికి కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. నెల రోజుల క్రితం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ న్యూఢిల్లీలోని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ కార్యాలయంలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్‌లతో కలిసి కేంద్ర పట్టణాభివృద్ధి, గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి శ్రీనివాస్‌ను కలిసి నిధుల మంజూరుకు విన్నవించారు. జగిత్యాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, మురుగు నీటి శుద్ధి ప్లాంటు అవసరాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. రూ.400 కోట్ల అంచనాతో డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు రూపొందించి అందించారు.

యూఐడీఎఫ్ పథకం కింద అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఎస్‌టీపీ సీవరేజ్ ప్లాంట్‌కు నిధులు మంజూరు చేయాలని కోరారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రత్యేక చొరవ చూపడం, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ ప్రయత్నాలతో కేంద్రం నిధుల మంజూరుకు హామీ ఇచ్చింది. నిధుల మంజూరు పూర్తయితే పట్టణంలో యూజీడీకి సంపూర్ణంగా లైన్‌క్లియర్ అయినట్లవుతుంది. ఇందుకు అనుగుణంగా కేంద్రం సంకేతాలు ఇవ్వడంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీపై ప్రజల్లో ఆశలు పెరుగుతున్నాయి.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి కృషి

-సంజయ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో జగిత్యాల మున్సిపల్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి అవసరమైన కృషి చేస్తున్నా. ఇప్పటికే డిటేయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టును తయారు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. కేంద్రం నుంచి సహకారం అందేలా ఎంపీ అరవింద్ కృషి చేస్తున్నారు. సాధ్యమైనంత తొందరలో యూజీడీ నిధులు మంజూరుతో పాటు నిర్మాణం జరిగేలా కృషి చేస్తున్నా.

వాటర్‌ప్లాంట్ మాయం



మూసి ఉన్న వాటర్‌ప్లాంట్

మల్యాల, మే 9(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని బల్వంతాపూర్ గ్రామస్తులకు శుద్ధజలాలు అందించే గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో నిర్వహించే వాటర్‌ప్లాంట్ గత కొంత కాలంగా మాయం అయింది. కొన్నాళ్ల క్రితం ప్లాంట్ మరమ్మతులకు గురి కావడంతో రిపేర్ చేపించి బిల్లు ఇవ్వకపోవడంతో రిపేర్ ఖర్చుల కింద తీసుకెళ్లినట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో ప్లాంట్ ఉన్న గదిలో సామాగ్రి లేకపోవడంతో మూసివేశారు. బల్వంతాపూర్ గ్రామంలో ఏడాదికిపైగా ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక ధరలకు నీటిని కొనుగోలు చేయాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు. కాగా ఈ విషయమై గ్రామ ప్రత్యేక అధికారి, ఎంపీవో ప్రవీణ్‌ను సంప్రదించగా తనకు ఈ విషయం తెలియదని తెలుసుకుంటానని అన్నారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే చర్యలు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో జీవకర్ రెడ్డి

కోరుట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : వయోవృద్ధులైన తల్లిదండ్రులను విస్మరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్డీవో జీవకర్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో కార్యాలయ ఏవో రాజమణిలతో కలిసి సీనియర్ సిటిజన్స్ రూపొందించిన వాల్ పోస్టర్, కరపత్రం, స్టిక్కర్లను ఆర్‌డీఓ జీవకర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ జీవకర్‌రెడ్డి మాట్లాడారు. వాల్ పోస్టర్, కరపత్రాల ద్వారా అవగాహన చేస్తున్న సీనియర్ సిటిజన్స్ కమిటి జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, కోరుట్ల డివిజన్ అధ్యక్షుడు పబ్బా శివానందంను ఆర్‌డీఓ అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ సభ్యులు రాజేశ్వర్, సాంబమూర్తి, గంగారాం, సైఫోద్దిన్ పాల్గొన్నారు.

సైన్యానికి మద్దతుగా సంఘీభావ ర్యాలీ

జగిత్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి): భారత సైనికులకు సంఘీభావం పలుకుతూ శుక్రవారం జగిత్యాలలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రధాన వీదుల్లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఫ్లెక్సీ ప్రదర్శన చేస్తూ ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా భారత సైనికులకు మద్దతుగా నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాచకొండ శ్రీరాములుతో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

● **జగిత్యాల అర్బన్:** భారతసైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం పట్ల జగిత్యాల జిల్లా కేంద్రంలో ముస్లిం సోదరులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు మీర్ కాజీమ్ అలీ, ముజీబుద్దీన్, ముకస్సీర్ అలీ నేహల్ పాల్గొన్నారు.

● **కోరుట్ల:** ఆపరేషన్ సిందూర్ విజయవంతంను స్వాగతిస్తూ శుక్రవారం కోరుట్ల పట్టణంలో ముస్లిం సోదరులు ర్యాలీని నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరాస్తా నుంచి జాతీయ జెండాలతో ముస్లిం సోదరులు ర్యాలీని జాతీయ రహదారిపై కార్గిల్ చౌరస్తా వరకు నిర్వహించారు.

● పట్టణంలోని వివిధ ఆలయాలలో దేవాలయ శాఖ అధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. పట్టణంలోని వేంకటేశ్వర, ఆంజనేయ స్వామి దేవాలయాలలో ప్రత్యేక పూజలను అర్చకులు బీర్నంది నర్సింహ చారీ, శ్యాంసుదర్‌లు నిర్వహించారు. కార్యక్రమంలో వేంకటేశ్వర దేవాలయ అభివృద్ధి కమిటి అధ్యక్షుడు ఎతి రాజం నర్సయ్య, ఆలయ ఈఓ విక్రం పాల్గొన్నారు.

● **రాయికల్:** రాయికల్ పట్టణంలోని నాగారం హనుమాన్ ఆలయంలో శుక్రవారం సైన్యానికి మద్దతుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్, కుర్మ మల్లారెడ్డి, ఎలిగేటి అనిల్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్ పాల్గొన్నారు.

● పెగడపల్లి: పెగడపల్లిలో శుక్రవారం ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాలు నిర్వహించారు. బతికెపల్లి గ్రామానికి చెందిన న్యాయవాది క్యాస రఘునందన్, రిటైర్డ్ ఏఎస్ఐ మల్లయ్య ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

వైభవంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం

మెట్‌పల్లి రూరల్, మే, 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగ్గసాగర్ గ్రామ శివారులోని కొండపై వెలిసిన స్వయంభూ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో బాగంగా స్వామి వారి కల్యాణాన్ని శుక్రవారం ఆలయాభివృద్ధి కమిటీ, గ్రామస్థులు నిర్వహించారు. ఉత్సవాల్లో బాగంగా ఆలయాన్ని రంగుల పూలు, మాడితోరణాలతో అలంకరించారు. ఉదయం ఆలయంలోని ఉత్సవమూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు, అలంకరణ, అర్చనలు తదితర కార్యక్రమాలను పురోహితులు చేపట్టారు. అనంతరం పురోహితులు వేదమంత్రోత్సవాల మధ్య స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించడానికి మండలంలోని ఆయా గ్రామాలతో పాటు ఇతర మండలలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకుని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయం అవరణలో ఏర్పాటు చేసిన అన్నప్రసాదం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ ఎంపీటీసీ పుల్ల జగన్‌గౌడ్, నాయకులు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి, డాకూరి వెంకటేష్, ఆలయాభివృద్ధి కమిటీ, గ్రామస్థులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

'పాకిస్తాన్ దాడిని ప్రపంచ దేశాలు ఖండించాలి'

జగిత్యాల, మే 9 (ఆంధ్రజ్యోతి): భారతదేశ సార్వభౌమత్వంపై పాకిస్తాన్ దాడిని ప్రపంచ దేశాలు ఖండించాల్సిన అవసరముందని మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి శుక్రవారం ఒక పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు. కాశ్మీర్లోని పహల్గావ్లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ, ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ చేపట్టి, పాక్ ఆక్రమిత కాశ్మీర్లోని ఉగ్రవాదుల శిబిరాలను గుర్తించి, సామాన్య పౌరులకు నష్టం కలుగకుండ కేవలం ఉగ్రవాదులపై శిబిరాలపై దాడులు చేయడంలో విజయం సాధించడం హర్షించదగ్గ విషయమన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం

జగిత్యాలరూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధి నిరుపేదలపాలిట వరమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి గ్రామానికి చెందిన గిద్దె రాజయ్య కూతురు స్వేచ్ఛ వినికిడి సమస్యతో బాధపడుతుంది. శస్త్రచికిత్స చేయించుకోవడానికి డబ్బులు లేకపోవడంతో ఆరికంగా ఇబ్బంది పడుతుంది. విషయాన్ని గ్రామమాజీసర్పంచ్ రజితశేఖర్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మానవతదృక్పథంతో స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ. 8 లక్షలు ఎల్‌ఓసీ మంజూరు చేశారు.

పవర్ లిఫ్టింగ్‌లో భూక్యా శ్రావణి ప్రతిభ

ధర్మపురి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో భూక్యా శ్రావణి బ్రాంజ్ మెడల్ సాధించింది. ధర్మపురి మండలంలోని పెద్దనక్కలపేట గ్రామానికి చెందిన శ్రావణి పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఆమె 52 కేజీల విభాగంలో స్క్వాడ్ 105 బేంజ్ ప్రెస్, 50 డెడ్ లిఫ్ట్, 115 మొత్తం 270 కేజీల బరువు ఎత్తి మెడల్ సాధించింది.

మెడల్ సాధించి భూక్యా శ్రావణి దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుక రావడం పట్ల పలువురు గ్రామస్థులు, ప్రజాప్రతినిదులు ప్రత్యేకంగా ఆమెను అభినందించారు.

ఆయిల్ పాం సాగుపై దృష్టి సారించాలి



సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

కోరుట్ల రూరల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : ఆయిల్ పాం సాగులో ప్రభుత్వాలు కల్పిస్తున్న సబ్సిడీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీహరి, హర్టికల్చర్ అధికారి రజిత్ సూచించారు. శుక్రవారం మండలంలోని యూసుఫ్ నగర్ గ్రామంలోని గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఆయిల్ పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఆయిల్ పాం సాగుపై దృష్టి సారించాలన్నారు. డ్రిప్ పరికరాలలో అందిస్తున్న సబ్సిడిని రైతులకు అధికారులు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన రైతు విశిష్ఠ సంఖ్య అన్‌లైన్ నమోదుపై రైతులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముక్కెర లింబాది, సురేష్, రైతులు లక్ష్మీనర్సయ్య, మరిపల్లి శేఖర్, గడ్డం శేఖర్ రెడ్డి, ఏషాల గంగాధర్, కరిపే తుక్కయ్య, అజయ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలి

కోరుట్ల, మే 9 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల డిపో నుండి వివిధ ప్రాంతాలకు నడుపుతున్న బస్సు సౌకర్యాలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ మోహన్ కొరారు. శుక్రవారం పట్టణంలోని ఆర్‌టీసీ డిపో కార్యలయంలో డిపో మేనేజర్ మోహన్ విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. డిపో నుండి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు 2 ఏసీ, 2 నాన్ ఎసీ బస్సులు నడుస్తున్నాయని, అదే విధంగా కోరుట్ల నుండి ఆంధ్రప్రదేష్ రాష్ట్రంలోని కనిగిరి - పామూరు, కనిగిరి - వింజమూర్ ప్రస్తుతం రెండు బస్సులు నడిచేవని ప్రయాణికులు తాకిడిని దృష్టిలో ఉంచుకోని మరో రెండు అదనంగా నాన్ ఎసీ బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. అన్‌లైన్ ద్వార బస్సు టికెట్‌ను బుక్ చేసుకోని సీట్‌ను పోందే సౌకర్యం ఉందని ఆయన తెలిపారు. ప్రయాణికులు ఆర్‌టీసీ బస్సును సద్వినియోగం చేసుకోని ఆర్‌టీసీ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ప్రైవేట్ వాహనాలలో ఆశ్రయించవద్దని కొరారు.

న్యాయవాది మృతి తీరని లోటు

మెట్‌పల్లి టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణానికి చెందిన న్యాయవాది గోరుమంతుల ప్రభాకర్ మృతి బార్ అసోసియేషన్‌కు తీరని లోటని, మంచి న్యాయవాదిని బార్ కొల్పోయిందని బార్ అధ్యక్షులు కంతి మోహన్‌రెడ్డి అన్నారు. ప్రభాకర్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తు మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంతాప సభ ఎర్పాటు చేసి ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో న్యాయ వాదులు తోగిటి రాజశేఖర్, పసునూరి శ్రీనివాస్, పుప్పాల లింబాద్రి, వెంకట నర్సయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

పార్కులను వినియోగించుకోవాలి

మెట్‌పల్లి టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్కులను ప్రజలు వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ అన్నారు.అంబేద్కర్,కుబ్ సింగ్ కుంట పార్కులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కులను